# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 20-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ప్రకాశం జిల్లాలో పర్యటిస్తారు.**

**2. చేతివృత్తి కళాకారులకు విశ్వకర్మ యోజన పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ తెలిపారు.**

**3. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలనను కొనసాగిస్తూ సుపరిపాలన అందిస్తున్నామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.**

**4. అర్హులైన వారందరికీ సామాజిక భద్రతా పింఛనులు అందించేందుకు ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.**

**5. రాష్ట్రంలోజాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ప్రకాశం జిల్లాలో పర్యటిస్తారు.ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజుల పూర్తయిన సందర్భంగా జిల్లాలోని మద్దిరాలపాడు గ్రామంలో " ఇది మంచి ప్రభుత్వం " పేరిట నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని అధికారులు తెలిపారు. ఈ మధ్యాహ్నం 2 గంటలకు ఉండవల్లి నుంచి బయలుదేరి నాగులుప్పలపాడు మండలం, చదలవాడ చేరుకుని, మద్దిరాలపాడు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి, అనంతరం గ్రామ సభలో పాల్గొంటారని తెలిపారు.

--------------------------

చేతివృత్తి కళాకారులకు విశ్వకర్మ యోజన పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ తెలిపారు. తిరుపతిలో విశ్వకర్మ యోజన పథకం అవగాహన కార్యక్రమాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, చేతివృత్తిదారుల కోసం కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ యోజన పథకాన్ని అమలు చేస్తోందని అన్నారు. కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు అందించే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (29 సెకన్లు)

--------------------------

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలనను కొనసాగిస్తూ సుపరిపాలన అందిస్తున్నామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలోని బంగారుపాళ్యంలో జాతీయ డయాలసిస్ పథకం కింద నూతనంగా నిర్మించిన డయాలసిస్ కేంద్రాన్ని మంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాష్ట్రంలో ఉన్న కిడ్నీ బాధితుల కోసం ప్రత్యేకంగా డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 3కోట్ల రూపాయల వ్యయంతో 30 పడకల డయాలసిస్ కేంద్రాన్ని నిర్మించామని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని అర్హులైన వారందరికీ సామాజిక భద్రతా పింఛనులు అందించేందుకు, కొత్త పింఛన్ల మంజూరుకు ఐదుగురు మంత్రులతో కూడిన ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, నూతన ఫించన్ల మంజూరు, పాత పింఛన్ల మార్గదర్శకాలపై ఉపసంఘం సమీక్షించనుందని తెలిపారు. 50 ఏళ్ల వయసు వారికీ పింఛను మంజూరు చేసే అంశంపై కూడా ఉపసంఘం అధ్యయనం చేయనుందని చెప్పారు, రాష్ట్రంలో 50 నుండి 60 ఏళ్ల మధ్య వారికి పింఛను అందజేసే విధానంపై త్వరలో మార్గదర్శకాలను ఖరారు చేయనున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఏక్ పేడ్ మాకే నామ్ – అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కను నాటాలని చిత్తూరు జిల్లా అటవీ శాఖ అధికారి చైతన్య కుమార్ రెడ్డి కోరారు. జిల్లాలోని పూతలపట్టులో ఈ రోజు నిర్వహించిన ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలను నాటారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, ఆలయాల సమీపంలో మొక్కలను నాటుతున్నామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో ప్రభుత్వ పాఠశాలలలో, విద్యార్థుల చేత మొక్కలు నాటిస్తున్నామని తెలిపారు.

---------------------------

జాతీయ పోషక మాసోత్సవాల్లో భాగంగా పోషకాహారం పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఉండి సమగ్ర శిశు అభివృద్ధి సేవ–ఐసీడీఎస్ పర్యవేక్షణాధికారి నిర్మల కుమారి తెలిపారు. జిల్లాలోని ఉండి మండలం వెలివర్రు గ్రామ అంగన్వాడీ కేంద్రంలో ఈ రోజు నిర్వహించిన పోషక మాసోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, ఈనెల 30వ తేదీ వరకు పోషక మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజు అంగన్వాడి కేంద్రాల్లోనూ పోషకాహార అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణ కింద 6 వేల 585 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రహదారి పనులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. నిన్న అమరావతిలో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో మొత్తం 348 కిలోమీటర్ల మేర హైవేల నిర్మాణం జరుగుతోందని, 31 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారుగా స్థాయి పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. 290 కోట్ల రూపాయలతో రహదారుల మరమ్మతులు చేసేందుకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని, వర్షాలు తగ్గిన వెంటనే పనులు మొదలు పెట్టనున్నామని చెప్పారు. కొన్ని రాష్ట్ర రహదారులను కూడా ప్రభుత్వ ప్రయివేట్

భాగస్వామ్యం –పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని నిర్ణయించామని, పీపీపీ విధానంలో టోల్ వసూలు చేసి రహదారుల నిర్వహణ చేపడతామని మంత్రి తెలిపారు.

---------------------------

ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దసరా మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. విజయవాడలోని నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో అధికారులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తుల రద్దీకి అనుగుణంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తాగునీరు, తాత్కాలిక సౌచాలయాలు, పారిశుధ్య నిర్వహణ వంటి ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

---------------------------

విద్యార్థులకు అంతరిక్ష కార్యకలాపాలపై అవగహన కల్పించేందుకు అక్టోబర్ 5 వ తేదీ నుంచి 7 వరకు జాతీయ అంతరిక్ష వారోత్సవాలను నిర్వహించనున్నట్లు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సిహెచ్.నాగరాణి తెలిపారు. భీమవరంలోని స్థానిక పాఠశాలలో వారోత్సవాలను నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అంతరిక్షం పట్ల అవగాహన కల్పించేలా, అంతరిక్ష యాత్రల్లో భారత్ పాత్ర, అంతరిక్ష విశేషాలు, విజయాలు వంటి అంశాలపై ప్రత్యేక ప్రదర్శనలను ఏర్పాటు చేయనున్నామని కలెక్టర్ తెలిపారు.

---------------------------

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా కొచువేలి–హజరత్ నిజాముద్దీన్ మధ్య ప్రత్యేక వారాంతపు రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. కేరళ రాష్ట్రం తిరువనంతపురం కొచువేలి – ఢిల్లీ హజరత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ ల మధ్య నడిచే ప్రత్యేక రైలు అక్టోబర్ 11వ తేదీ నుంచి నవంబర్ 29వ తేదీ వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం కొచువేలి నుండి బయలుదేరి హజ్రత్ నిజాముద్దీన్ చేరుకుంటుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు అక్టోబర్ 14 నుంచి డిసెంబర్ రెండో తేదీ వరకు ప్రతి సోమవారం తెల్లవారుజామున 4 గంటల 10 నిమిషాలకు నిజాముద్దీన్ లో బయల్దేరి కొచువేలి చేరుకుంటుందని ఈ రైలు విజయవాడ డివిజన్‌లో విజయవాడ , నెల్లూరు ,గూడూరు స్టేషన్‌లలో ఆగుతుందని తెలిపారు.

---------------------------

విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న రెండో పడవను నిన్న ఒడ్డు చేర్చినట్లు అధికారులు తెలిపారు. ఇనుప గడ్డర్లతో రెండు పడవలను అనుసంధానించి పడవను వెలికి తీసి. నీటమునిగిన పడవను బ్యారేజీ ఎగువన పున్నమి ఘాట్ వద్దకు తరలించినట్లు చెప్పారు. బ్యారేజీ వద్ద ఇంకా మరో భారీ పడవ, మోస్తరు పడవ నదిలో ఉన్నాయని. ఈరోజు మూడో బోటును ఒడ్డుకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 114వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

తిరుమల లడ్డు వివాదం పై ఉప ముఖ్యమంత్రి కె. పవణ్ కళ్యాణ్ స్పందించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సామాజిక మాధ్యమం ద్వారా తెలిపారు. ఆలయాల్లో జరిగే అంశాల పర్యవేక్షణకు సనాతన ధర్మ రక్షణ బోర్డు ఏర్పాటు చర్యలు తీసుకోనున్నామని అభిప్రాయం వ్యక్తం చేశారు.

=======================